# మనిషి - ఆడమనిషి

— పురిపండా అప్పలస్వామి

ధనుర్మాసం చివరిరోజు. కచేరీ గంట తొమ్మిదికొట్టింది. పేవ్‌మెంట్‌మీద, మంత్రుల గుమ్మాలలో మెంబర్లలాగ వాల్తున్నాయి ఈగలు చలి నిరంకుశ ప్రభుత్వం లక్ష విప్లవాలు లక్ష్యపెట్టలేదు. ఎలక్ట్రిక్ స్తంభాల పక్క పిట్టగోడ దగ్గిర చిరిగిన ఇక్ష్యాకులనాటి ఈత చాపమీద గోనెపాత ముసుగుతన్ని నిద్రపోతున్నాడు మనిషి. మోటారు చక్రాలూ గుర్రబ్బళ్ళూ, స్కూటర్లూ ఆ మహా నగరంలో ఈ పేవ్‌మెంట్లమీద. జులుం చెయ్యవు. ధూళి మాత్రం విరజిమ్ముతాయి. బొంయ్యి బొంయ్యి వెర్రికేకలు వినిపిస్తాయి మోటార్లవి. రాజకీయ పక్షాల స్లోగన్లలాగ పెట్టి పుట్టిన వాళ్ళ జోళ్ళ చప్పుళ్ళు ఏవగించుకుంటూ వెళ్ళిపోతాయి. పార్కులోని పచ్చదనమూ. ఏమీలేని అమ్మాయిల నవ్వుల్లాగ వాసనలేని రక రకాల పువ్వుల కులుకులూ ఇటురాకుండా పిట్టగోడ అడ్డు.

ఇంత ప్రశాంతమైనచోటు ఇంక ఎక్కడ దొరుకుతుంది మనిషికి ;

ఎన్నికల్లో ఓడిపోయిన ఇండిపెండెంటులాగ అతడితో కుస్తీలు పట్టి చలి వీగిపోయిందేమో! అలాగే నిద్రపోతున్నాడతడు.

ఒక చిత్తకుక్క వచ్చి, అతడి కాళ్ళకేసి మోచూసింది, వెళ్ళి పోయింది.

పదిగంటలు కొట్టారు.

ఆడపిల్లల బస్సు వెర్రి అరుపులు అరుస్తూ పరిగెత్తింది.

మనిషి లేచాడు. గోనె పట్టావుంటే నిండా కప్పుకున్నాడు. చుట్ట చుట్టి చాప భుజంమీద వేసుకొన్నాడు; రెండు ఆవలింతలు తీసి ముందుకి నడిచాడు.

అతడి బూచిగెడ్డానికి మంగలి కత్తి ఏనాడూ వోటిచ్చిన పాపాన పోలేదు. చింపిరి తలని నూనెబొట్టు మూసూడరేదు. ఆ కళ్ళల్లో అఖాతాలూ, చూపుల్లో అగ్నిపర్వతాలూ దాక్కుంటాయి. ఆజానుబాహు కళేబరం అస్థిచర్మాలతో గట్టి పడింది మమ్మీలాగ.

అతడు నడుస్తూ రోడ్డుమీంచి బీడీ పీకలూ సిగరెట్ ముక్కలూ ఏరుకున్నాడు;

ఒక సందులో తెల్లమచ్చల నల్లకుక్క అతణ్ణిచూసి మొరుగుతూ పారిపోయింది.

అలాగే వొక పెద్దహోటలు పక్కకి నడిచాడు మనిషి. దాని ప్రొప్రయిటరు ఆ వూరి మున్సిపల్ వైస్ చైర్మేన్. పదిహేనేళ్ళలోనూ వొక్కసారీ పీగిపోవడం ఎరగడతడు. వోటింగు రోజున ఆ హోటల్లో ఖాళీవుండదు. పరిమళం గుప్‌మంటుంది.

హోటల్ బయట మున్సిపల్ డబ్బావేపు తొంగిచూశాడు మనిషి. ఏమిటి కనబడలేదో అతడికి పక్క బుల్లెమ్మ దుకాణంలో వేలాడుతున్న కొబ్బరితాడు నిప్పుతో వొక సిగరెట్ ముక్క ముట్టించాడతడు. రెండు దమ్ములతో పీక భస్మమై పోయింది. పొగగా మారిపోయింది. ఈ అనంత విశ్వంలో-పంచభూతాల్లో మాయమైపోయింది.

హోటల్ నౌకరు కుర్రాడు పుల్లాకులు తెచ్చి మున్సిపల్ చెత్తల డబ్బాలో వేశాడు.

రెండుకుక్కలు పరుగెత్తుకువచ్చి, డబ్బాలో దూకాయి.

మనిషి గబగబా వెళ్ళాడు. చాపచుట్టతో వాటిని బాదాడు. అవి పక్కకి తప్పుకున్నాయి.

పుల్లాకుల దొంతర రెండు చేతులతోనూ తెచ్చి గోనెలో వేసుకొని పేవ్‌మెంట్ చేరుకున్నాడు మనిషి. కుక్కలు రెండూ జాలిగాచూస్తూ నించుండిపోయాయి పెర్మిట్లు దొరకని పెద్దమనుషుల్లాగ.

చెదిరిపోయిన ఈగలు డబ్బాలోకి పురికేశాయి.

పుల్లాకులతో పేవ్‌మెంట్‌మీద కూచున్నాడు మనిషి. ఒక్కొక్క ఆకూ వూడ్చి ఉచ్చిష్టం ఒక ఆకులో చేర్చాడు. దూరాన్ని చిత్రకుక్క తోకాడిస్తూ నిలబడింది. ఊడ్చేసిన ఎంగిలాకులు దానికి విసిరాడు మనిషి.

మరో కుక్క వచ్చింది, రెండో కొట్లాడాయి, ఇది నా జన్మ హక్కు అంటే ఇది నా జన్మ హక్కు' అంటూ ఊర్చుగా చేరిన ఎంగిలి చూసుకుని సంతృప్తి పడ్డటు కూచున్నాడు మనిషి.

ఏవరికోసమో ఆ నిరీక్షణ!

అంతలో మరిన్ని ఎంగిలాకులు బుట్టలో వేసుకొని వొక ఆడ మనిషి కంకాళం వచ్చింది. ప్రతి ఎముకా లెక్కకి అందేటట్టుంది ఆ శరీరం కప్పడానికి ఏ ప్రత్తిచెట్టూ వొప్పుకోలేదేమో!

ఆమె తెచ్చిన ఆకులు ఇద్దరూ వూడ్చారు. ఎంతో తక్కువ ఎంగిలి కూడింది.

మనిషికంటే ఆడమనిషి తక్కువ.

ఆమె జాలిగా చూసింది.

అబ్బ! ఎన్ని లోకాలు కాల్చగలదా జాలి!

ఏదేశోద్ధారకుడూ, ఏ మంత్రి పుంగవుడూ, ఏ మహా సంస్థల అధ్యక్షుడూ ఎరగనిది ఆ జాలి.

రెండు సరికొత్త మోటార్లు ధూళి విసురుకుంటూ వెళ్ళిపోయాయి. నల్లబజార్ తెల్లకార్లవి.

ఉడతా భక్తిగా లభించిన ఆ ధూళివల్ల ఆ ఎంగిలి పరిమాణం ఏ మాత్రం హెచ్చుతుంది!

మనిషి తనకూడు కొంత ఆడమనిషికిచ్చాడు.

ఇద్దరూ భోజనం చేశారు. చేతులు నాక్కున్నారు. దగ్గిర కుళాయి నీళ్ళతో కడుపుల్లో మిగిలిన భాగాలు నిండాయి.

ఇద్దరూ–మనిషీ ఆడమనిషీ పిట్టగోడ నానుకుని కూచున్నారు.

"నిన్నటికంటే ఇవాళ నయం."

"అవును."

మనిషి బీడిముక్క నోట్లో పెట్టుకున్నాడు. ఆడమనిషి అగ్గి తెచ్చింది.

యోగిలాగ ముక్కుచివర చూపునిలిపి, రెండు పీకలు సాంతం చేశాడు మనిషి.

ఆమె వీపుమీద వాతచూసి "ఇదేమిటి?" అన్నాడు మనిషి.

"బండివాడు కొరడావేశాడు."

"ఊఁ"

పొద్దు వాలిందాకా మనిషీ, ఆడమనిషీ అలాగే కూచున్నారు.

దిగాలుమంటూన్న మొహాలతో కచేరీ గుమాస్తాలూ, మలిగుడ్డలతో మరపని మనుషులూ, మోతబరువు పుస్తకాలతో బడికుర్రాళ్ళూ, కళ్ళద్దాల, పొట్టిపైటల కొత్తమ్మాయిలూ, ఊదొత్తుల సాయిబూ, సినీమాకి ముస్తాబయిన వీధి పడుచులూ, గడించీ గడించని నల్లకోట్ల ప్లీడర్లూ, వంకాయమూడిక క్రయివేటు మేష్టరూ, ముద్దమొహం తపాలా జమానూ

తోసుకుంటూ, రాసుకుంటూ, వూగుతుంటూ పేవ్‌మెంట్‌మీంచి వెళిపో యారు.

రాత్రిపడింది. ఇంటింటా దీపాలు వెలిగాయి. దొంగబియ్యమమ్మే అప్పలమ్మ కిటికీలో రేడియో అరవగలిగినంత గట్టిగా అరుస్తోంది. "పరిమిత కుటుంబం పరమసుఖం," వీధి ట్యూబ్‌లైట్ గుడ్డికన్నులా వెక్కిరిస్తోంది.

మనిషీ ఆడమనిషీ లేచారు. తలోవేపూ వెళ్ళారు. ఎంగిలాకులు తెచ్చుకున్నారు. ఎంగిలి మెతుకులు ఊడ్చుకు తిన్నారు. రాత్రివుళ్ళ పైపుల్లో నీళ్ళు కారవు. అలాగే పేవుమెంట్‌మీద నిద్రపోయారు వాళ్ళు.

ఉదయాన్నే ఆమె బయలుదేరి పోతుంది. మళ్ళీ వేళకి చేరుకుం టుంది.

మర్నాడు - ఆవాళ పెద్దపండగ, మకర సంక్రాంతి, కలిగినవాళ్ళకి కలివిడి.

పది కొట్టాక లేచాడు మనిషి. పుల్లాకులు తెచ్చుకున్నాడు. ఎంగిలి ఊడ్చాడు. రోజూకంటే రెండింతలు కూడింది.

దేశమంతా పండగ. విందులూ, పిండివంటల వాసనా అతడి పుల్లా కుల్లోకూడా వుంది. ఉత్సాహం అతడి మొహంలో తొంగిచూసింది.

చిత్తకుక్కకి వొక చిన్న గారిముక్క విసిరాడు. సగం ఉడికిందే అయితేనేం గాక కుక్క వొదిలేయలేదది. గబుక్కున మింగేసి, మళ్ళీ తోకాడించింది.

అగ్గి లేదే! ఆకు వొదిలేసి వెళ్ళడ మెలాగ? ఉత్తి బీడీముక్క నోట్లో పెట్టుకున్నా డతడు.

పన్నెండు కొట్టారు.

ఏం చెప్మా, ఇవాళ యింత వేళయినా ఆమె రాలేదు? పండగనాడు అలస్యమెందుకూ?

తనకి ఆకలిగా వుంది. నోరూరుతూ వుంది. నిజమే, అయితే - ఆమె రాకుండా ఎలా సయిస్తుంది?

ఈగలు ముసురుకున్నాయి. సగం తినెయ్యవు కదా?

ఒకటీ—రెండూ—మూడూ—నాలుగూ. అయిదు గంటలూ అయింది.

ఆడ మనిషి రాలేదు.

మరి రాదా?

కారణం?

ఎన్ని పండగలు రాలేదు. పోలేదు; ఎన్నడూ యిలా జరగలేదు.

తన గుండెలలో యేదో కలిచినట్టవుతోంది.

ఆకూ, అన్నమూ వొదిలేసి లేచిపోయాడు మనిషి. కాకులూ, కుక్కలూ దాన్ని ఆక్రమించుకున్నాయి.

సిగరెట్ పీకకి నిప్పటించా రతడు. ఆమెకోసం వెతుకుతూ బయలుదేరాడు.

రిక్షావాని పాట :

నువ్వెల్లిపోయినా వంటే,
పచ్చినై నేనేటా కొట్లాడుతుంటే.

అదృష్టవంతుల హడావుడితో పార్కు గుబగుబలాడిపోతూవుంది. చెట్టాపట్టాలు పట్టుకు నడుస్తూన్న ఈ ప్రజాజోడీల రంగురంగుల దుస్తులలోంచి వాసనలు గుమ్ముమంటున్నాయి. ఊదేస్తే పడిపోతే ఏంగాని, చదువుకున్న అమ్మాయిల పిరపిరలు గిలిగింతలు పెడుతున్నాయి. చాలీ చాల్ని, ఉండీ వుండని స్టెర్లిన్ చీరలు చూస్తున్న కుర్రకవి కలంతో లొట్టలు వేస్తున్నాడు. కవితా పారవశ్యంలో కళ్లు తేలవేస్తున్నాడు. పొడుం కాయ ఝాడిస్తూ శాస్తుల్లుగారు బిళ్ళజోడులోంచి కళ్లు సున్నపు కాయల్లా చేస్తున్నారు.

సందు మొగని పువ్వుల మేడచుట్టూ సైకిల్‌కుర్రాళ్లు పదిసార్లు తిరిగారు. సంక్రాంతి గేయం రాసిన పిల్లకవి అందరాని అమ్మాయికోసం జిలుగు కవరు పట్టుకు అదే తిరుగుతున్నాడు. సంక్రాంతి ప్రోగ్రాం వున్నవాళ్ళ ప్రతియింటా రేడియో అదే గోల. ప్రత్యేకం వచ్చిన అరవ ఫిలింకోసం గుంపులు గుంపులు ఎగబడుతున్నారు జనం. ఆడాళ్ళ గేటుదగ్గర అరవ గోల.

పెపేటు మెంబర్ల గర్వం గౌనులాగ పట్నంమీద చీకటి. రక్ష రేకులిచ్చి సంపాదించిన డబ్బులతో ఫకీరు సాయిబు దొంగకల్లు పాకలో దూరుతున్నాడు. ఎవరో మంత్రిగారికి విందు. దారికడాకా పోలీసులు శవంపెట్టికి మేకుల్లాగ.

ఆడమనిషికోసం ప్రతి సందూ తిరిగాడు మనిషి. ప్రతి హోటలు పక్కా వెదికాడు. ప్రతి పెంటకుప్పా చూశాడు. దీపాలంచే మాత్రం ఆమె ఎక్కడా అవుపించలేదు.

అర్ధరాత్రి పేవ్‌మెంటు దగ్గరికి వచ్చి చూశాడు. ఆమె రాలేదు.

పార్కులో ఏవో నీడలు.

కూలబడి కూచుండిపోయాడు మనిషి. చలిని అతడే మరిచాడో, చలే అతణ్ణి మరిచిందో! ఒంటిమీద గోనెపాత వేసుకోడానికి అతడు ప్రయత్నించలేదు. ఆమెకోసం చూసూనే రాత్రి గడిపేశాడు.

వేకువ చల్లగాలికి ముడుకుల్లో తలపెట్టుకు కూచున్నాడు.

రాత్రౌ చిబుక సమర్పిత జానుః

ఎపుడో ఎలాగో చిన్న కునుకు పట్టింది. ఆ కునుకులో ఆడ మనిషిని కలగన్నాడు.

ఆమె జుత్తుకి నిప్పంటుకుంది. పెద్ద కారడివిలా మండిపోతున్నాది. ఢఃఢణా ఫైర్ బ్రిగేడ్ తనమీదికే వచ్చేస్తోంది.

కెవ్వున కేకవేశాడు మనిషి.

గొనేరులాగ సూర్యుడు తొలికిరణం అప్పుడే విసురుతున్నాడు.

ఇంత పెదకేక ఎన్నడూ వెయ్యలేదు మనిషి.

అతడు మళ్ళీ బయలుదేరాడు. వీధిలో తనకాళ్ళకింద ఎన్నో బీడీ పీకలూ, సిగరెట్ ముక్కలూ అవుపించాయి. ఒక్కటీ తియ్యలేదతడు. తన కాళ్ళు కుడికి పడుతున్నదీ, ఎడమకి పడుతున్నదీ తనకే తెలీదు. రెండు కాళ్ళు యంత్రంలాగ-మరలు సడలిన బండిలాగ వీధీ, వీధీ, సందు సందూ నడుస్తున్నాడు. తనని చూసి మొరిగే కుక్కల్ని అరిచే మోటార్లనీ గమనించనేలేదతడు. హోటళ్ల పక్క మున్సిపల్ చెత్తడబ్బాల్లో చెయ్యి పెట్టలేదు.

నాలుగు రోడ్లూకలిసే సందుపక్క ఏమిటది? ఏదోచూసి వడి వడిగా వెళ్ళాడు మనిషి తూలుతూ. ఆమె రోజూ పుల్లాకులుతెచ్చే చింకి బుట్ట మురుగు కాలవ పక్కనించి తీశాడు, దానినిండా రక్తం మరకలు.

మనిషి లోతుకళ్ళలో కన్నీళ్ళులేవు. అర్చుకుపోయాయి. అక్కడే కూలబడి పోయాడతడు. అర్థంకాని వెర్రిచూపులు శూన్యం స్తంభింపజేస్తున్నాయి.

బటాణీలమ్ముకుంటున్న కుర్రాడు అతణ్ణిచూసి ఆగాడు.

"నిన్న ఇంతవేళకే పెద్దరెడ్డిగారి మోటారు కిందపడి ఇక్కడ పాకీ ముష్టిది చచ్చిపోయింది" అన్నాడు.

ఆ దినమంతా మనిషి అక్కడే కూచోడం అందరూ చూశారు. రాత్రి వెళిపోయింది. ఆ మర్నాడు తెల్లవారాక మనిషి శవం మంచులో కొరడుబారి పడుంది.